క్లుప్తంగా

సామాజిక సేవలో డాక్టరేట్


పీటర్ నాయక్

కూసుమంచి: మండలంలోని గోరీలపాడు తండా శివారు చాంప్లా తండాకు చెందిన లకావత్ పీటర్ నాయక్‌కు సామాజిక సేవా కార్యక్రమాల్లో గౌరవ డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో నివాసముంటున్న ఆయన ముప్పై ఏళ్లుగా తెలంగాణ, ఏపీ, ఒడిశాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ బాధ్యులు ఆయనకు డాక్టరేట్ అందజేయగా, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, సర్పంచ్ సరస్వతి తదితరులు అభినందించారు.

చెట్ల నరికివేతపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీలో చెట్లను నరికిన ఘటనపై స్థానిక సామాజిక కార్యకర్త కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి లోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం సమీపంలో గల రహదారి వెంట పంచాయతీ ఆధ్వర్యాన నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. కాగా, కొంత మంది స్వప్రయోజనాల కోసం ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికారు. దీంతో సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ వేప చెట్లను నరికిన ఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పొంగులేటి సోదరుల పూజలు


అరుణాచల గిరి క్షేత్రంలో పొంగులేటి సోదరులు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పంచభూత లింగ క్షేత్రాలలో ఒకటైన అరుణాచల గిరి క్షేత్రాన్ని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డిలో కలిసి దర్శించుకున్నారు. తమిళనాడులోని ఈ క్షేత్రాన్ని మంగళవారం కాముని పౌర్ణమి సందర్భంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డిలతో కలిసి గిరి ప్రదక్షిణ చేశారు.

పెవిలియన్ మైదానం అప్పగించేందుకు వేలం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహణలో ఉన్న పెవిలియన్ మైదానంలో ఎగ్జిబిషన్/సర్కస్ నిర్వహణ హక్కులు కల్పించేందుకు తొలిసారిగా వేలం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. వేలంలో అనుమతి దక్కించుకున్న వారికి 61 రోజుల పాటు మైదానంలో సర్కస్ లేదంటే ఎగ్జిబిషన్‌కు ఏర్పాటుకు అవకాశం లభిస్తుంది. కాగా, జిల్లాతో పాటు పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల కాంట్రాక్టర్లు పోటీ పడుతుండగా.. కొందరు రింగ్ అయినట్లు సమాచారం. కాగా, రానున్న వేసవిలో ఎగ్జిబిషన్ల కోసం కాకుండా క్రీడల కోసం మైదానాన్ని కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	బలగం
సాయిరాం	ఆర్గానిక్ మామా హైబ్రిడ్ అల్లుడు
ఆదిత్య	వినరో భాగ్యము విష్ణు కథ
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	గ్యాంగ్ లీడర్

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	26		20
కాకర	40	చుక్కకూర	2
బోడ కాకర	40		10
బీర	56	తోటకూర	2
దొండ	38		10
పొట్లకాయ	34	గోంగూర	2
చిక్కుడు	60		10
గోరుచిక్కుడు	36	మెంతికూర	5
క్యాబేజీ	16		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	18		15
చామగడ్డ	64	పుదీన	1
క్యారెట్	22		15
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	

హోలీ.. హోలీల రంగ హోలీ..

హోలీ.. హోలీల రంగ హోలీ.. చెమ్మకేలీల హోలీ.. అంటూ మండలాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా.. మంగళవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పురవీధుల్లో సందడి చేశారు. పలు ప్రాంతాలు, కాలనీలు, అపార్టుమెంట్‌లలో దీజే ఏర్పాటు చేసుకొని కులమతాలకతీతంగా యువతీ, యువకులందరూ కేరింతలు కొడుతూ ఆనందోత్సాహాల నడుమ డ్యాన్సులు వేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం వేడుకల్లో పాల్గొని సందడిసందడిగా గడిపారు. అనంతరం దగ్గర్లోని చెరువులు, బావుల్లో స్నానాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


హోలీ వేడుకల్లో మేయర్ నీరజతో పాటు డిప్యూటీ మేయర్, మహిళా కార్పొరేటర్లు


ఖమ్మం సహకారనగర్: కలెక్టర్, సీపీలను ఎత్తుకున్న వివిధ శాఖల అధికారులు


ఖమ్మంగాంధీచౌక్: బ్రాహ్మణ బజార్‌లో బాలికలు, మహిళల హోలీ సంబరాలు


పాకబండ బజార్‌లో షవర్ హోలీ


నేలకొండపల్లి: మంగాపురం తండాలో డీజే ఏర్పాటు చేసుకొని నృత్యాలు చేస్తున్న దృశ్యం


హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో హోలీ ఆడుతున్న మహిళలు


యువతుల రంగుల ఆనందకేళి..


తిరుమలాయపాలెం: జల్లెపల్లిలో సంబరాలు చేసుకుంటున్న యువకులు, చిన్నారులు


ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెంలోని సంత్ సేవాలాల్ దేవాలయ ప్రాంగణంలో..


పార్శిబంధంలో చిన్నారుల కేరింతలు


నృత్యం చేస్తున్న మార్వాడీలు


కామేపల్లిలో సందడి ఇలా..


రఘునాథపాలెం: కామంచికల్ పంచాయతీలోని పాటివారిగూడెంలో సందడి చేస్తున్న యువకులు

నిధులున్నా నెల జీతం ఏది?

నేలకొండపల్లి: నిధులు లక్షల్లో ఉన్నా.. ఆ పూజారికి నెల జీతం కరువైంది. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో అతడు కుటుంబంతో సహా ఆందోళనకు దిగాడు. మండల కేంద్రంలోని శ్రీఉత్తరేశ్వరస్వామి దేవాలయంలో కొడవటిగంటి నరసింహారావు పూజారిగా పనిచేస్తున్నాడు. గతంలో ఆలయానికి చెందిన 23 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా పూజారి కోర్టులో కేసు వేసి 2018లో రూ.51 లక్షలను సాధించారు. ఆ నగదును ఆలయం పేరిట స్థానిక బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అప్పటినుంచి పూజారికి వేతనం ఇవ్వటం లేదు. దీప, ధూప, నైవేద్యానికి కూడా నిధులు రావడం లేదు. దేవాదాయ శాఖ అధికారులకు పలుమార్లు గోడు వినిపించినా పట్టించుకోలేదు. మంగళవారం దేవాలయం వద్ద పూజారి విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి కుటుంబంతో సహా నిరహారదీక్ష చేయనున్నట్లు ప్రకటించారు.

ఎస్‌బీఐటీలో ప్రాంగణ నియామకాలు


ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ కృష్ణ

ఖమ్మం సహకారనగర్: వివిధ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో తమ కళాశాల విద్యార్థులు 37 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఎస్‌బీఐటీ చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని సోమవారం రాత్రి కళాశాలలో అభినందించి మాట్లాడారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చందర్, రవీంద్రబాబు, కంపెనీ బాధ్యులు ఆది నారాయణ, ధీరజ్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 24న తిరుమలాయపాలెం మండల కేంద్రానికి వస్తున్న ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను అన్నారు. మంగళవారం మండలంలోని పిండిప్రోలు, మేడిదపల్లి, హస్నాబాద్, సుబ్లేడు గ్రామాలలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాలో ఆయన మాట్లాడారు. నాయకులు తుల్లూరి నాగేశ్వరరావు, వెంకట్రావు, పులకాని వెంకటనర్సయ్య, రవి, పద్మనాభుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలు



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, సొంత జాగా ఉన్నవారికి రూ.5 లక్షలు రుణం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. బీజేపీ పాలనలో గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని తెలిపారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సీపీఎం ప్రజా చైతన్య యాత్రలు చేస్తుందని, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, నాయకులు శ్రీనివాసరావు, ఎస్.నవీన్‌రెడ్డి, తిరుపతిరావు, సుదర్శన్ పాల్గొన్నారు.

రుణాల పేరుతో మభ్యపెడుతున్న ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ సలాం

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేవలం రుణాల పేరుతో ప్రభుత్వం మైనార్టీలను మభ్యపెడుతున్నారని తంజీమ్ ఏ ఇన్సాఫ్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ సలాం అన్నారు. మంగళవారం లెనిన్‌నగర్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.సైదా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలో ముస్లింలకు ఒరిగింది ఏమిలేదన్నారు. ఉపాధి అవకాశాలు లేక, ఉన్న రిజర్వేషన్ అమలు కాక, వక్ఫ్ భూములు, స్మశానవాటికలు కనుమరుగయ్యాయని తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఉన్న మైనార్టీలకు 28 మందికి రూ.లక్ష చొప్పున, 12 మందికి రూ. రెండు లక్షల చొప్పున మొత్తం 40 మందికి రుణాలు ఇచ్చి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతున్న రంజాన్ వేడుకలప్పుడు కేవలం ఓట్ల కోసమే ఇఫ్తార్, దావత్‌ల పేరుతో మసీదుల చుట్టూ తిరుగుతారని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివారెడ్డి, ఎండీ రెహ్మాన్, ఎస్‌కె.చానా, డాక్టర్ కాసీం పాషా, జహూర్, జాంబి, అఫ్రిన్, రిజ్వానా పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణోత్సవం


తిరుమలాయపాలెంలోని తెట్టెలపాడులో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: మండలాల్లోని పలు ఆలయాల్లో స్వామివార్ల కల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలోని స్తంభాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో చివరి రోజు మంగళవారం శ్రీలక్ష్మి జయంతి వేడుకల్లో భాగంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నేకల్‌లో గోపయ్య సమేత లక్ష్మీ తిరుతమ్మతల్లి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు కాశాయిల శ్రీనివాసశర్మచే నిర్వహించారు. ఆలయ చైర్మన్ వరగాని మోహన్‌రావు, సుశీల తదితరులు పాల్గొన్నారు. అంతేకాక తిరుమలాయపాలెం మండలంలోని తెట్టెలపాడులోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించి గ్రామంలో ఊరేగించారు.

ఘనంగా ప్రారంభమైన అమ్మవార్ల జాతర


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్‌లో గల కైకొండాయిగూడెం ప్రధాన రహదారిలోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీముద్దిరావమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు 11వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని దేవాలయ చైర్మన్ కొమ్ము భాస్కర్ తెలిపారు. మొదటిరోజు జాతర ప్రారంభ వేడుకల్లో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, నాగండ్ల కోటి తదితరులు పాల్గొని పూజలు చేశారు. భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యాన తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేవాలయ ప్రాంగణంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్ల అమ్మకం స్టాళ్ల ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన కార్యదర్శి సూరంశెట్టి నర్సింహారావు, కోశాధికారి గుండోజు రామాచారి, సభ్యులు గాదె రాంబాబు, కాటేపల్లి రమేష్, రెడ్డిబోయిన వెంకటేశ్వర్లు, రామారావు, జనార్ధనాచారి, తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో..

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో మంగళవారం ప్రారంభమైన శ్రీ అంకమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు దేవాలయంలో భక్తులు జలబిందెల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కళాకారులు చింతమణి నాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్ ఈవూరి సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

షోరూంలో చోరీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ బైక్ షోరూంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. షోరూ వెనకాల తలుపులు తీసుకుని వచ్చిన దుండగులు రూ.5వేల నగదు చోరీ చేశారు. ఘటనపై షోరూం బాధ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం పోలీసులు విచారణ చేపట్టారు.

బెదిరించి చెవికమ్మలు..

ఖమ్మంరూరల్: ఖమ్మం కవిరాజ్‌నగర్‌కు చెందిన జొన్నలగడ్డ లక్ష్మిని ఓ వ్యక్తి బెదిరించి బంగారు చెవికమ్మలు చోరీ చేశాడు. రోజులాగే కూలీ పనులకు బయలుదేరిన ఆమె మంగళవారం ఇల్లెందు క్రాస్‌రోడ్ అడ్డా వద్ద వేచి ఉండగా, ఓ వ్యక్తి వచ్చి కరుణగిరి సమీపంలో ఫంక్షన్ ఉందని తీసుకెళ్లి బెదిరించి చెవి కమ్మలతో పాటు సెల్‌ఫోన్, నగదు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు స్వచ్ఛంద సంస్థలు, పలు పార్టీల ఆధ్వర్యంలో మహిళలకు అభినందన, సన్మాన కార్యక్రమాలతో పాటు ఉత్తమ సేవలు అందించిన పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. అంతేకాక పలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్


కూసుమంచి: ఆశా కార్యకర్తలను సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు


ఖమ్మంగాంధీచౌక్: మార్పు కోసం సంతకాల ఉద్యమంలో తొలి సంతకం చేస్తున్న కలెక్టర్ సతీమణి గౌతమి


ఖమ్మం సహకారనగర్: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళను సన్మానిస్తున్న మేయర్ నీరజ తదితరులు


ఖమ్మంస్పోర్ట్స్: టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో.. క్యారమ్స్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

అటెన్షన్ ప్లీజ్

రద్దీ రోడ్డులో ప్రమాదకర గుంత



నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెం వెళ్లే ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. వాహనాలు దగ్గరకు వచ్చే వరకు గుంత కనపడకపోవడంతో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రహదారిపై స్థానికులతో పాటు గ్రానైట్ పరిశ్రమలకు వచ్చి వెళ్లే వాహనాలతో రద్దీ ఉంటుంది. మరిన్ని ప్రమాదాలు జరగకముందే అధికారులు మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - ఖమ్మం అర్బన్

ప్రశ్నించాల్సిన అధికారి : కుమార్, మున్సిపల్ ఏఈ, ఖమ్మం
సెల్ నంబర్ : 94412 25169